సన్న ధాన్యం దిగుబడిపై రైతులు ఆందోళ న చెందొద్దు

● జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

పెంచికల్‌దిన్నె గ్రామంలో వరి పైర్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 3: జిల్లాలో సన్నరకం వరి సాగు చేసిన రైతులు దిగుబడి విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి పెంచికల్‌దిన్నె గ్రామంలో సన్నరకం సాగు చేసిన రైతుల పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు 30 ప్రైవేట్ కంపెనీలకు చెందిన సన్నరకం వరి విత్తనాలతో సాగు చేసిన రైతుల పొలాల్లో గడువు కంటే ముందుగానే పొట్టదశకు చేరుకుంటున్నాయని తెలిపారు. దీంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నట్లు వెల్లడించారు. నవంబర్ 15వ తేదీ కంటే ముందుగా నాట్లు వేసిన పొలాల్లో ఈ సమస్య అధికంగా కనిపించినట్లు వివరించారు. చలి ఎక్కువగా ఉండడంతో పాటు పగలు సమయం తక్కువగా ఉండడం కూడా ఈ పరిస్థితికి కారణమన్నారు. అదనంగా నత్రజని ఒక డోసుతో పాటు వెస్టేజ్ ఎకరాకు 5 కేజీల చొప్పున వాడితే పూతదశ ఆగి పిలకలు పెరుగుతాయన్నారు. దీంతో దిగుబడి పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ దిగుబడి తగ్గినట్లయితే సంబంధిత కంపెనీల నుంచి నష్టపరిహారానికి సిఫార్సు చేస్తామన్నారు. జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో రైతులు సన్నరకాలే సాగు చేస్తున్నారని వెల్లడించారు. అనంతరం నేరేడుచర్లలోని పలు ఎరువుల దుకాణాల్లో నిల్వలను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ జావిద్, ఏఈఓ స్వప్న పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నివాళి

మధుబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మోతె, ఫిబ్రవరి 3: మండలంలోని నేరెడవాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కండక్టర్ వెంకన్న కుమారుడు మధుబాబు మృతి బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం నేరడవాయి గ్రామంలో మధుబాబు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు, మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి, జిల్లా నాయకుడు ఏలూరి వెంకటేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు పాషా, మండల నాయకులు రామకోటి, పల్సు మల్సూర్, బోజ్యనాయక్, కుక్క భిక్షం, గోదులు ఉపేందర్, బుర్ర సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రధాని దిష్టిబొమ్మ దహనం

గరిడేపల్లి: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 3: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారంటూ సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో మండలంలోని వెలిదండ గ్రామంలో సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు మేకల నాగేశ్వరరావు, కందుల వెంకటేశ్వర్లు, యానాల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'అగ్గితెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'



వరి కంకులను పరిశీలిస్తున్న అధికారులు

మునగాల, ఫిబ్రవరి 3: వరిలో అగ్గితెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నరేశ్, ఏడీఏ యల్లయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆకుపాములలో రైతు సాంబయ్య సాగు చేసిన వరి పొలాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. పొలంలో అగ్గి తెగులు, మొగి పురుగు, ఆకుచుట్ట పురుగు నివారించకపోతే మెడ విరుపు తెగులుగా మారి పూర్తిగా వరి పైరుకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి'

మఠంపల్లి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 3: సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా వినయ్‌బాబు మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న లక్ష డప్పులు-వేల గొంతుకల సభ పోస్టర్‌ను సోమవారం పట్టణ పరిధి హుజూర్‌నగర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి మాదిగ సభకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఏపూరి రాజు మాదిగ, యలమర్తి రాము, జి.పాండు, చీమ శ్రీనివాసరావు, కర్ల కాంతారావు, పి.రఘు పాల్గొన్నారు.

మఠంపల్లి: ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఇరుగు ప్రభు మాదిగ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో లక్ష డప్పులు-వేల గొంతుకల సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నేరేడుచర్ల: నేరేడుచర్లలో ఎమ్మార్పీఎస్ నాయకులు సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇంజమూరి మల్లయ్య, ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడవెల్లి చంద్రయ్య, మార్కెట్ డైరెక్టర్ మచ్చ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద భిక్షం మాదిగ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు యడవెల్లి బాటసారి, దేవదానం, ఎం.రవి, ఎం.వేణు తదితరులు పాల్గొన్నారు.

'అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు'

వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న చైతన్య వేదిక, పౌర స్పందన వేదిక నాయకులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 3: అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన సీపీఎం రాష్ట్ర మహాసభల్లో ఆయనను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. పెన్‌పహాడ్ మండలం నుంచి మొట్టమొదటి సారి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికైన నెమ్మాది వెంకటేశ్వర్లును సోమవారం భక్తళాపురం గ్రామంలో చైతన్య వేదిక, పౌర స్పందన వేదికల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతం వెంకటేశ్వర్లు, నల్లపు రామ్మూర్తి, యాట ఉపేందర్, జుట్టుకొండ గణేశ్, నెమ్మాది అడివయ్య, మచ్చ లింగయ్య, బుస్సా వీరయ్య, పి.గురువయ్య, జి.శ్రీరాములు, ఎన్.పీరయ్య, రమేశ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఫిబ్రవరి 3: నులి పురుగుల నివారణకు ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులకు సూచించారు. నేషనల్ డీ వార్మింగ్ డేను పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 10న అన్ని స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లలో మాత్రలు వేయించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,01,560 మంది పిల్లలను గుర్తించడం జరిగిందని వెల్లడించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యాధికారి నుంచి ఆశ కార్యకర్తల వరకు డీ వార్మింగ్ డేలో భాగస్వాములు కావాలని ఆదేశించారు. పంచాయతీ అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని సూచించారు. ఈ మాత్రలు తీసుకోనివారికి ఫిబ్రవరి 17న మరోసారి అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, డీఈఓ అశోక్, డీడ బ్ల్యూఓ నరసింహారావు, డాక్టర్ నజియా తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కోదాడ రూరల్, ఫిబ్రవరి 3: పట్టణ పరిధి లక్ష్మీపురం కాలనీలో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లి జయంత్ (28) అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు సంవత్సరాల క్రితం శిరీష అనే అమ్మాయిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, మద్యం మత్తులో జయంత్ ఆదివారం అర్ధరాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన భార్య చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగులగొట్టి కిందకు దింపగా అప్పటికే మృతిచెందాడు. జయంత్ తల్లి గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ ఎస్ఐ ఎస్కే.సైదులు తెలిపారు.

మృతిపై అనుమానాలు..

కాగా, సోమవారం జయంత్ పుట్టినరోజు ఉంది. బట్టలు తీసుకోవడానికని తనకు తెలిసిన వారి వద్ద రూ.1,500 అప్పు తీసుకున్నాడు. అయితే, తెల్లవారేసరికి శవమై కనిపించడంతో బంధువులు, స్థానికులు జయంత్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పురుగు మందు తాగి స్టాఫ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

నడిగూడెం, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో స్టాఫ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బీరవెల్లి సుధాకర్‌రెడ్డి సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సహకార సంఘంలో స్టాఫ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తనను పరపతి సంఘం చైర్మన్ విధి నిర్వహణలో కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించాడు. డ్యూటీని సక్రమంగా చేయనీయకుండా తనపై చేస్తున్న ఒత్తిడి వల్లనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపాడు. కాగా, చికిత్స నిమిత్తం సుధాకర్‌ను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు సూర్యాపేట ఏరియా దవాఖానకు తీసుకెళ్లారు. ఈ విషయమై పీఏసీఎస్ చైర్మన్‌ను వివరణ కోరగా.. సుధాకర్‌రెడ్డిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదని తెలిపారు.

గ్యాస్ లీకై పానిపూరి బండి దగ్ధం

తుంగతుర్తి, ఫిబ్రవరి 3: గ్యాస్ లీకై మంటలు చెలరేగి పానిపూరి బండి దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. తుంగతుర్తికి చెందిన జి.వీరన్న పానిపూరి బండి నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం పానిపూరి చేస్తుండగా సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగి బండి పూర్తిగా దగ్ధమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

'లక్ష డప్పులు' సభను విజయవంతం చేయాలి

తుంగతుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంజేఎఫ్ నాయకులు

తుంగతుర్తి, ఫిబ్రవరి 3: హైదరాబాద్ నగరంలో ఈ నెల 7వ తేదీన జరిగే లక్ష డప్పులు- వేల గొంతుకల సభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డుపై మాదిగ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎంజేఎఫ్) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటాలు చేయడం జరుగుతుందని, ఈ పోరాటం చివరిదశకు చేరిందని, ప్రతి మాదిగ బిడ్డ డప్పుతో తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7వ తేదీలోపు ఎస్సీ వర్గీకరణ చేయకపోతే చావు డప్పు కొడతామని, చేస్తే విజయోత్సవ డప్పు కొడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జర్నలిస్టు నాయకులు కొండగడుపుల ఎల్లయ్య, కొండగడుపుల లక్ష్మణ్, తడకమళ్ల రవికుమార్, పోతరాజు వెంకన్న, ఎంఈఎఫ్ సంఘం నాయకులు వీరమల్లు, మల్లెపాక రవీందర్, గురువయ్య, ఆకారపు భాస్కర్, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల్లో 'అరుణోదయ' కీలక పాత్ర

కోదాడ రూరల్, ఫిబ్రవరి 3: ప్రత్యేక తెలంగాణ, సారా వ్యతిరేక, ప్రజా ఉద్యమాల్లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కీలక పాత్ర పోషించిందని ప్రజా వేదిక కన్వీనర్ రాయపూడి వెంకటేశ్వరరావు అన్నారు. ఫిబ్రవరి 5న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగనున్న రెండు అరుణోదయ సంస్థల విలీన సభ పోస్టర్‌ను సోమవారం కోదాడలోని లాల్ బంగ్లాలో ఆవిష్కరించి మాట్లాడారు. కొంత కాలం క్రితం చీలిపోయిన రెండు సంస్థలు తిరిగి ఒక్కటవుతున్నాయని, సభలో కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, నాయకులు అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి, పోకల మైసయ్య, విజయ్, వీరబాబు, సురేశ్, నగేశ్, రవితేజ, సైదులు, ఖాసీం, గోపి పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలో అరుణోదయ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర ఉమేశ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి గుండెబోయిన వెంకన్న, ఏఐకేఎంఎస్ నాయకులు పగడాల సుధాకర్‌రెడ్డి, సిద్దల చంటి, బొజ్జ నవీన్, గడ్డం ఉపేందర్, ఎర్ర ఉపేందర్ పాల్గొన్నారు.

'క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి'

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 3: ప్రజలు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, జిల్లా జడ్జి శ్రీవాణి, ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ గీతానగశ్రీ అన్నారు. అక్షర ఫౌండేషన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాయిన్‌గూడెం శివారులోని వికాస్ ఫార్మసీ కళాశాలలో క్యాన్సర్ నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అని తెలిపారు. దేశంలో క్యాన్సర్‌తో మృతిచెందే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్షర ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, రుద్రంగి కాళిదాసు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ఆడెపు రమేశ్, శ్రీనివాస్‌రావు, సుభాశ్ చంద్రబోస్, వినయ్‌కుమార్, నీలిమ, భవాని పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న జోగు అరవిందర్‌రెడ్డి

గరిడేపల్లి, ఫిబ్రవరి 3: మండలంలోని పొనుగోడు గ్రామంలో ఓ నిరుపేద కుటుంబానికి జేపీఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించి అండగా నిలిచింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన అప్పికట్ల సరిత ఇటీవల మృతిచెందారు. సరిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతుండడంతో విషయం తెలుసుకున్న జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవిందర్‌రెడ్డి సోమవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా 50 కిలోల బియ్యం, ఒక నూనె డబ్బాను అందజేశారు. ఈ కార్యక్రమంలో మలికంటి కార్తీక్, ఉపేందర్, పకీర్, నందిపాటి సైదులు, నేల పట్ల రవి, అశోక్, రాంబాబు, పృథ్వీ, మనోహర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 3: సూర్యాపేట పట్టణానికి తాగునీటిని అందించే అవంతిపురంలోని మిషన్ భగీరథ ప్రధాన పంపింగ్ స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభ

చివ్వెంల, ఫిబ్రవరి 3: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని దురాజ్‌పల్లిలో గల ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు కొల్లు మహిధర్, బి.శ్రీకర్ విజయవాడలో జరిగిన సీబీఎస్ఈ రీజినల్ స్థాయి స్కిల్ ఎక్స్‌పోలో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ సోమవారం తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన ఇంటిలిజెంట్ బస్సు నమూనా నిర్వాహకులను ఆకట్టుకున్నట్లు తెలిపారు. ఈ నెల 4,5 తేదీల్లో బెంగళూరులో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

మైనింగ్ తవ్వకాలు అడ్డగింత

తిరుమలగిరి, ఫిబ్రవరి 3: మండలంలోని తొండ గ్రామంలో చేపడుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలను అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. చుట్టుపక్కల చాలా మంది రైతులు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారని, మైనింగ్ వల్ల వారు జీవనోపాధి కోల్పోతారని అన్నారు. పనులు చేపడితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, వెంకన్న, ఎల్లయ్య, వెంకటయ్య, ప్రవీణ్, రవి, లక్ష్మయ్య, నవీన్, సోమనర్సయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పశు వైద్య శిబిరం

మఠంపల్లి, ఫిబ్రవరి 3: చౌటపల్లి గ్రామంలో మేళ్లచెర్వులోని మైహోం ఇండస్ట్రీస్, రాష్ట్ర పశువైద్య, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశు పోషకులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరు జాబితాపై నేడు సమావేశం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 3: నాగారంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మారయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో గ్రామ పంచాయతీల వారీగా జారీ చేసిన ఓటరు లిస్టుకు అదనంగా చేర్చిన ఓట్ల గురించి వివిధ పార్టీల మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో మండలస్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా పార్టీల నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపాలిటీని సందర్శించిన అదనపు కలెక్టర్

తిరుమలగిరి, ఫిబ్రవరి 3: తిరుమలగిరి మున్సిపాలిటీ చైర్మన్ పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు బాధ్యతలు చేపట్టారు. సోమవారం మున్సిపాలిటీని సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు.మున్సిపాలిటీలో సమస్యలు లేకుండా చూసుకోవాలని కమిషనర్ యాదగిరికి సూచించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం'

తుంగతుర్తి, ఫిబ్రవరి 3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేదలకు, నిరుద్యోగ యువతకు నిధుల కేటాయింపులో మొండిచేయి చూపారని, విభజన హామీలు కూడా అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష వీడి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సురేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం నుంచి పారిపోయిన విద్యార్థులు

● తిరిగి పట్టుకొచ్చిన పోలీసులు

రూరల్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులతో ఎస్ఐ అనిల్‌రెడ్డి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 3: కోదాడ మండలం దోరకుంట గ్రామ శివారులో ఉన్న నెమలిపురి పునరావాస కేంద్రంలోని ఎస్సీ గురుకుల వసతి గృహం నుంచి ఆరుగురు విద్యార్థులు పారిపోవడం కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి.. శనివారం గురుకుల పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో కొందరు విద్యార్థులు మద్యం తాగి అల్లరి చేసినట్లు ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి దృష్టికి వచ్చింది. విద్యార్థులను వారు మందలించి విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేశారు. దీంతో ఐదుగురు పదో తరగతి విద్యార్థులు, ఒక తొమ్మిదో తరగతి విద్యార్థి ఆదివారం మధ్యాహ్నం పాఠశాల గోడ దూకి సమీపంలోని 65వ నంబర్ జాతీయ రహదారికి చేరుకొని లారీలో విజయవాడకు వెళ్లారు. విద్యార్థులు పారిపోయిన విషయాన్ని గుర్తించిన ప్రిన్సిపాల్.. జిల్లా జోనల్ అధికారి విద్యారాణికి సమాచారం అందించారు. జోనల్ అధికారి సూచన మేరకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన పోలీసులు పాఠశాలలోని తోటి విద్యార్థుల వద్ద సమాచారం రాబట్టి వారు విజయవాడ చేరుకున్నట్లుగా గుర్తించి అక్కడికి వెళ్లారు. విద్యార్థులు విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఉండగా పట్టుకొచ్చి కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపారు.

ఇంటి నుంచి పారిపోయిన విద్యార్థి ..

తిరుమలగిరి: ఇంటి నుంచి పారిపోయిన ఓ విద్యార్థిని పోలీసులు తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండ్లపల్లికి చెందిన నజీర్ బాషా తుంగతుర్తిలోని మైనార్టీ వసతి గృహంలో ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు. వసతి గృహంలో ఉండి చదవడం ఇష్టం లేక సోమవారం ఇంటి నుంచి సెల్‌ఫోన్ తీసుకొని పారిపోయాడు. సాయంత్రం వరకు ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ లొకేషన్‌ను గుర్తించిన పోలీసులు వరంగల్ జిల్లా తొర్రూర్‌లో విద్యార్థిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.

సైబర్ మోసాల బారినపడొద్దు : ఎస్ఐ

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ

మోతె, ఫిబ్రవరి 3: విద్యార్థులు సైబర్ మోసాల బారిన పడొద్దని ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాలపై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితులకు బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు తెలపొద్దని సూచించారు. మెసేజ్‌లలో వచ్చే బ్లూలింక్‌ను అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయొద్దని తెలిపారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు రోడ్డు నియమ, నిబంధనలు తెలుసుకోవాలని, అతివేగంతో ప్రయాణాలు చేయొద్దని అన్నారు. విద్యార్థినులపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వ్యక్